క్లుప్తంగా

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు 15 మంది ఎంపిక



ఉమ్మడి విశాఖజిల్లా ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైన లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలకు 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికై నట్టు పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, పీడీ పి.లక్ష్మి తెలిపారు. సోమవారం పెందుర్తి నియోజవర్గం పరిధిలో ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, కబడ్డీ, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా విభాగాల్లో 15 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రమణ, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

హడలెత్తించిన నాగుపాము



పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: పెద్ద నాగుపాము ఉక్కునగర వాసులను హడలెత్తించింది. టౌన్‌షిప్ సెక్టార్-11లోని 111ఏ క్వార్టర్ గార్డెన్‌లో మంగళవారం సుమారు ఐదడుగుల నాగుపాము కనిపించింది. దీంతో హడలెత్తిన ప్రజలు పరుగులు తీశారు. వెంటనే స్నేక్ సేవర్ సొసైటీ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన క్వార్టర్ గార్డెన్ లోకి వెళ్లి చూడగా అక్కడ ఉన్న మెస్‌లో పాము ఇరుక్కు పోయింది. కిరణ్ ఆ మెస్‌ను కత్తిరించి పామును ఒడిసి పట్టుకున్నారు. దీంతో అక్కడి ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. పామును అటవీ శాఖ అధికారుల సూచన మేరకు వదిలి పెడతానని కిరణ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ దిబ్బపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ ఉపకరణాలతోపాటు ఇతర వస్తువులు కాలిపోయిన కుటుంబానికి అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నెలకు సరిపడా బియ్యం, ఇతర వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఎం.మస్తాన్‌రెడ్డి, గుదే సుశీలా గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు, బొండా ఈశ్వరరావు, శీరంశెట్టి గోవిందరావు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి



వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు అందిస్తున్న వికాస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

అగనంపూడి: వృద్ధులను అక్కున చేర్చుకొని వారికి సముచిత గౌరవం కల్పించాలని వికాస్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ కె.జోగినాయుడు అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమాలు లేని సమాజం కోసం పాటుపడాలన్నారు. వికాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బొండా ఈశ్వరరావు వృద్ధులకు బెడ్‌షీట్లు, ఆహార పొట్లాలు అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, కోట గంగాధర్, ఎస్. కనకారావు పాల్గొన్నారు.

పనుల్లేవ్.. పస్తులే..



కొత్తగాజువాక జంక్షన్‌లో పనుల కోసం ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పని దొరికితే అదృష్టమే..

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం వచ్చి స్థిరపడ్డ కార్మికులు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానం వల్ల నిత్యం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొత్తగాజువాక జంక్షన్ మెయిన్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న డైలీమార్కెట్ వద్ద, రాజీవ్‌నగర్ జంక్షన్ ఫ్లై ఓవర్ వంతెన వద్ద రోజువారీ పని చేసే కార్మికులు నిత్యం నిరీక్షిస్తుంటారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు పని దొరకడం లేదని వాపోతున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతోపాటు విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి వలస వచ్చినవారు ప్రస్తుతం అవస్థలు పడుతున్నారు. ఒక్క కొత్తగాజువాక జంక్షన్‌లోనే ప్రతిరోజూ సుమారు 500 మంది కార్మికులు పనుల కోసం ఎదురు చూసి వెనుదిరుగుతున్నారు.

చంద్రబాబు వస్తే ఏదో చేస్తాడనుకున్నాం.. ఆయన దయవల్ల ఉన్న పని కూడా పోయింది. ఇసుక లేకుండా చేయడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. పనులు కోల్పోయాం. వంద రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉంది. ఇంటి అద్దె కూడా కట్టలేకపోతున్నాం. పిల్లల ఫీజులమాట దేవుడెరుగు.. తిండికి కూడా కష్టమైపోతోంది. గాజువాకలో ఒక భవన నిర్మాణ కార్మికుడి ఆవేదన ఇది.

ఇలాంటి కార్మికులు గాజువాక ప్రాంతంలో దాదాపు 15వేల మంది ఉన్నారు. వారిలో ఎవరికీ సరిగ్గా పని దొరకక పోవడంతో అవస్థలు పడుతున్నారు.

- ఇసుక లేక నిలిచిన నిర్మాణాలు
- భవన నిర్మాణ కార్మికుల విలవిల
- పనుల కోసం పడిగాపులు

గాజువాక: ఇసుకను పారదర్శకంగా, ఉచితంగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వంలో ఇసుకే అత్యంత ఖరీదైన వస్తువుగా మారిపోయింది. దీంతో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. ఫలితంగా వాటిపై ఆధారపడ్డ కార్మికులు పని కోల్పోయారు. గాజువాక ప్రాంతంలో ఎవరైనా వచ్చి తమకు పని చెప్పకపోతారా అనే ఆశతో వందల సంఖ్యలో కార్మికులు ప్రధాన జంక్షన్లలో ఎదురు చూసి చివరకు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకల్లా ప్రధాన జంక్షన్లకు వందల సంఖ్యలో కార్మికులు చేరుకొని తమకు పని ఇచ్చే యజమాని కోసం ఎదురు చూస్తున్నారు. పదిన్నర గంటల్లోపు పని దొరికితే సరేసరి. లేనిపక్షంలో ఉసూరుమంటూ వెనుదిరగాల్సిందే. కొద్దిరోజులుగా మధ్యాహ్నం 12 గంటల వరకు ఎదురు చూస్తున్నా పని దొరకడం లేదని కార్మికులు వాపోతున్నారు.



రాజీవ్‌నగర్ జంక్షన్‌లో పనుల కోసం ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు



పనుల కోసం ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

క్యారేజీలతో సహా కూడళ్లకు..

పని దొరుకుతుందన్న ఆశతో నిర్మాణ కార్మికులు క్యారేజీలతో సహా జంక్షన్లకు చేరుకుంటారు. తాపీ పని, వడ్రంగి పని, టైల్స్, మార్బుల్స్, మట్టిపనితోపాటు ఆ పనుల్లో సహాయకులుగా పని చేయడం కోసం ఎదురు చూస్తుంటారు. రాజీవ్‌నగర్ ప్రాంతంలోని దువ్వాడ, మంగళపాలెం, ఉప్పర కాలనీ, రాసాలమ్మ కాలనీ, యాతపాలెం, సిద్ధార్థనగర్ దరి ఉప్పర కాలనీ తదితర గ్రామాలు, కాలనీల్లో వలస కుటుంబాలు అధికంగా నివాసముంటాయి. ఆ ప్రాంతాలకు చెందినవారితో పాటు అగనంపూడి ప్రాంతాలకు చెందిన వారు కూలి పనుల కోసం రాజీవ్‌నగర్ జంక్షన్‌లో వేచి చూస్తుంటారు. గాజువాక జంక్షన్‌లో నిరీక్షించే **వారి సంఖ్య రెట్టింపు ఉంటుంది.** గాజువాకలోని **కృష్ణానగర్, పెంటయ్యనగర్,** బొజ్జన్నకొండ, **అప్పన్న కాలనీ, గణేష్‌నగర్, వాంబే** కాలనీ, బీసీ రోడ్ తదితర ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి ఇక్కడ వేచి చూస్తుంటారు. భవన యజమానులు ఆయా కేంద్రాలకు వెళ్లి తమ పనులకు కార్మికులను, కూలీలను ఎంపిక చేసుకొంటారు. ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేకపోవడం, బ్లాక్‌లో ధర ఆకాశాన్నంటడంతో నిర్మాణరంగంలో పనులు పరిమితమైపోయినట్టు కార్మికులు పేర్కొంటున్నారు. పనులు మందకొడిగా సాగుతుండటంతో రోజువారీ కార్మికులకు పని దొరకడం లేదని వాపోతున్నారు. అయినా ఏదో ఒక పని దొరక్కపోతుందా అనే ఆశతో ఎదురు చూస్తున్నామని, చివరకు నిరాశగా ఇళ్లకు వెళ్లిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

మూడు నెలలుగా పని లేదు



నేను తాళ్లపాలెం నుంచి ఇక్కడికి చాలా కాలం కిందట వచ్చాను. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో తాపీ పని చేసుకుందామని ఇక్కడికి వచ్చేశాను. మూడు నెలల్లో ఒక్కరోజు కూడా నాకు పని దొరకలేదు. ప్రస్తుతం ఇల్లు గడవడం కూడా చాలా కష్టంగా నడుస్తోంది. అద్దె కట్టలేకపోతున్నాం. తిండికే దిక్కులు చూడాల్సి వస్తోంది.

–ఎం.సత్తిబాబు, తాపీ మేస్త్రి

ప్రభుత్వం ఆదుకోవాలి



రోజూ ఉదయాన్నే జంక్షన్‌కు వచ్చి కొద్దిసేపు నిలబడితే పని దొరికేది. ఇప్పుడు మూడు నెలల నుంచి పనులు దొరకడం లేదు. ఇసుక లేకపోవడంతో పాటు మెటీరియల్ ధరలన్నీ పెరిగిపోడంతో ఇళ్లు, ఇతర నిర్మాణాలు చాలా వరకు ఆపేశారు. దీంతో మాకు పని కరువైంది. ప్రభుత్వం ఏదో ఒక చర్య తీసుకోకపోతే మాలాంటివాళ్లకు ఆకలే మిగులుతుంది.

–పోతిరెడ్డి వేణు, చిప్పర్

పరిస్థితి దారుణంగా ఉంది



చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మా పరిస్థితి దారుణంగా మారిపోయింది. నాకు భర్త లేడు. మా అబ్బాయి, నేను ఉంటాం. నేను పని చేస్తేనే ఇల్లు గడుస్తుంది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు పని లేకుండా పోయింది. మూడు నెలల్లో ఒక్కరోజు కూడా పని దొరకలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే మా పరిస్థితి ఏంటో తెలియడంలేదు.

– నాగమణి, బీసీ రోడ్

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా



మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దుకాణాల వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 30తో తమ లైసెన్సుల కాల పరిమితి ముగిసిందని వివరించారు. అయితే ప్రభుత్వం మాత్రం తమ ఉపాధి గురించి ప్రకటన చేయకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చేరుకుని దుకాణాలు తెరిచి విక్రయాలు ప్రారంభించాలని కోరారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించే వరకూ దుకాణాలు తెరిచే లేదని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో దుకాణాలు తెరిచారు.

న్యూ ఐటీఐ ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవ



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సిబ్బంది

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐ ప్రాంగణంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు స్థానికులతో కలసి శ్రమదానం చేశారు. ఏపుగా పెరిగిన ముళ్ల కంచెలు, పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాలను శుభ్రం చేసిన అనంతరం మొక్కలు నాటారు. వాటి సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ శానిటరీ సిబ్బందితో పాటు వికాస్‌నగర్ గృహ యజమానులతో కలసి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వికాస్‌నగర్ గృహ యజమానులు, జీవీఎంసీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దొడ్డి రమణ, నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారని చెప్పారు. ఈ నెల 6న ఉదయం 8 గంటలకు సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో పెంటకోట నాగేశ్వరరావు, అప్పలరెడ్డి, హనుమంతు, కొండలరావు, జానకి, హిమజ, వరలక్ష్మి పాల్గొన్నారు.

జిప్సా నూతన కమిటీకి అభినందన



విద్యాశాఖాధికారులతో జిప్సా ప్రతినిధులు

గాజువాక: గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా)నాయకులను మండల విద్యాశాఖాధికారులు అభినందించారు. నూతనంగా ఎన్నికైన గౌరవాధ్యక్షుడు పి.భాస్కరరావు, అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, ఎస్.షణ్ముఖరావు, కోశాధికారి ఎం.బాబూరావు తదితరులు విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీతలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల సమస్యలను వారికి వివరించారు. పాఠశాలల గుర్తింపు రెన్యువల్, సెలవులు, పరీక్షలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జిప్సా ప్రతినిధులను ఎంఈవోలు అభినందించారు.

శాస్త్రి, గాంధీజీ జయంత్యుత్సవాలు నేడు

అగనంపూడి: జాతిపిత మహాత్మాగాంధీ, భారత రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను బుధవారం 87వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు తెలిపారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మద్యం మత్తులో ఘర్షణ

అగనంపూడి: పూటుగా మద్యం సేవించిన ఇద్దరు మిత్రుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అగనంపూడిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అగనంపూడికి చెందిన బలిరెడ్డి నీరజ్, శనివాడకు చెందిన గొంతిన హేమంత్ మిత్రులు. వీరు స్థానిక బార్‌లో మధ్యాహ్నం నుంచి మద్యం సేవిస్తూ రాత్రి వరకు అక్కడే ఉండిపోయారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. కోపోద్రిక్తుడైన హేమంత్ నీరజ్‌పై బీర్ బాటిల్‌తో నెత్తిపై మోదడంతో గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. నీరజ్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి: రక్తానికి ప్రాణం పోసే శక్తి ఉందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అన్నారు. రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, లయన్స్ బ్లడ్ బ్యాంక్, వందేభారత్ బ్లడ్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో వంద యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఒకరు అందించే రక్తంతో ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పిన్నింటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపికల ప్రదానం



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో డీసీపీ సిన్హా

గాజువాక: మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకొని స్థానిక ట్వింకిల్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జాతి నిర్మాతలు గాంధీజీ, శాస్త్రీజీ అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు డీసీపీ తుహిన్ సిన్హా జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ, శాస్త్రీజీ, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహనీయుల జీవితాల గురించి తెలుసుకొని ఆ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి.శ్యామ్, ప్రిన్సిపాల్ ఎస్.కరుణకుమారి పాల్గొన్నారు.

అన్నసమారాధన

అగనంపూడి: మాస శివరాత్రిని పురస్కరించుకొని 85వ వార్డు పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ ప్రతినిధులు సోమునాయుడు, కట్టా పైడిరాజు, కొలిపాక అప్పారావు, విందుల వరహాలు, గెద్దాడ సత్యనారాయణ, సత్యవతి, దానబాల అప్పలనాయుడు, పట్టా రామఅప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు

డాబాగార్డెన్స్: బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడకలను డాబాగార్డెన్స్‌లో గల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఆంధ్రా మెడికల్స్, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పటల్స్, వాసన్ కేర్ హాస్పటల్స్ ద్వారా ఉద్యోగుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున ఉద్యోగులు ర్యాలీ చేశారు. బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి, జైల్‌రోడ్డు, జడ్జికోర్టు జంక్షన్, జగదాంబ సెంటర్, సరస్వతీ పార్క్ జంక్షన్ మీదుగా తిరిగి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ పీజీఎంటీడీ పాల్ విలియం మాట్లాడుతూ హైస్పీడ్ ఫైబర్ ఇంటర్నెట్, 4జీ సేవల గురించి వివరించారు. పీజీఎం(ఆపరేషన్స్) ఆడమ్ మాట్లాడుతూ ఎఫ్‌టీటీహెచ్ సేవలు, ఎంఎన్‌పీ బుకింగ్‌ల మెరుగుదల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి. శ్రీనివాసరావు, ఎం.సత్యప్రసాద్, కె.జగదీశ్వరరావు, ఆర్.శ్రీకాంత్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ఇవ్వాలని ఆందోళన



గాంధీనగర్ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండాపోయిందని, ఫలితంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక వెంటనే అమలు చేయాలని కోరుతూ జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్ సచివాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకముందు యార్డుల్లో ఇసుక పుష్కలంగా ఉన్నప్పటికీ 100 రోజుల్లో యార్డులను ఖాళీ చేశారని, ఆ ఇసుక ఎక్కడికి వెళ్లిందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరల పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని ధ్వజమెత్తారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడుతుంటే ఎన్నికల ముందు హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు విప్పకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.లక్ష్మి, అర్జున్, రాజారావు, త్రినాథరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము రేగుతోంది!



ఆటోనగర్ రాజధాని కాటా వద్ద వాహనాల రాకపోకల సమయంలో రేగుతున్న దుమ్ము



నాతయ్యపాలెం ట్రాన్స్ పోర్టు కార్యాలయాల వద్ద సర్వీసు రోడ్డు ఇలా..

అక్కిరెడ్డిపాలెం: ఆ రోడ్‌లో ప్రయాణం అంటే వాహన చోదకులు హడలిపోతున్నారు. మట్టి, దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నారు. వాహనాలు రాకపోకల సమయంలో భారీగా దుమ్ము గాలిలో లేచి వెనుక వస్తున్న ద్విచక్రవాహన చోదకులకు, ఆటోలకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. ఈ సమస్య ఆటోనగర్‌తో పాటు నాతయ్యపాలెంలోని ట్రాన్స్ పోర్టు కార్యాలయాల వద్ద ఎక్కువగా ఉంది. ఆటోనగర్‌లో ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలకు చెందిన లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డుపై పేరుకుపోయిన దుమ్ము గాలిలోకి లేచి వాహనచోదకులకు ఇబ్బందులు కలుగజేయడమే కాకుండా పరిసరాలన్నీ దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. నాతయ్యపాలెంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల వద్ద ఎక్కువ సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో సర్వీసు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. దీంతో రోడ్డుపై ఉన్న దుమ్ము రేగి వాహనచోదకులను ఇబ్బందుల పాల్జేస్తోంది. అధికారులు రోడ్డుపై ఉన్న మట్టిని తొలగిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పలువురు అంటున్నారు.

ఫెర్రోస్క్రాప్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: లాభాల్లో ఉన్న ఫెర్రోస్క్రాప్ నిగం లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం ప్రారంభించామని ఫెర్రోస్క్రాప్ నిగం లిమిటెడ్ యూనియన్ అధ్యక్షుడు పి. రాములు, ప్రధానకార్యదర్శి ఎం. అమ్మిరెడ్డి తెలిపారు. ఫెర్రోస్క్రాప్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్థను కాపాడుకోవడానికి చేస్తున్న న్యాయ పోరాటం కోసం ఉద్యోగులు, అధికారుల నుంచి రూ.1.75 లక్షలు విరాళాలు సేకరించామన్నారు. ఇప్పటికే ఢిల్లీ, కోల్‌కతా హైకోర్టుల్లో కేసులు వేశామన్నారు. త్వరలో బిలాస్‌పూర్ కోర్టులో కేసు వేయనున్నట్టు తెలిపారు. యూనియన్ చేపట్టే కార్యక్రమాల్లో ఉద్యోగులంతా పాల్గొనడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచవచ్చునన్నారు. కార్యక్రమంలో పర్సనల్ అధికారి అగ్రహార గుప్తా, అభిషేక్ శర్మ, సి.పి. ఆనంద్, బి. రంగారావు, పి. సర్కార్, పి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.